అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు

అద్దె భవనంలో కొనసాగుతున్న ఆబ్కారీ కార్యాలయం

- అరకొర వసతులతో ఇక్కట్లు
- సొంత భవన నిర్మాణాలు చేపట్టాలని ప్రజల వేడుకోలు

మెట్‌పల్లి, డిసెంబర్ 29: మెట్‌పల్లి పట్టణంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు సంబంధించిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సర్కిల్ కార్యాలయం సుమారు మూడు దశాబ్దాలకు పైగా అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. స్థిరాస్తుల బదలాయింపు, మార్టిగేజ్ డీడ్ వంటి రిజిస్ట్రేషన్లతో పాటు స్టాంపు డ్యూటీ కింద పెద్ద ఎత్తున ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతున్నది. ప్రభుత్వ నిర్లక్ష్యంతో అరకొర వసతుల నడుమ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నిర్వహించడంతో వచ్చే పోయే స్థిరాస్తుల క్రయ, విక్రయదారులు ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయ ఆవరణలో చెట్ల కింద, రాళ్లగోడలపై కూర్చొని రిజిస్ట్రేషన్ వరుస క్రమంలో పిలుపు కోసం నిరీక్షించాల్సి వస్తున్నది. అలాగే, ప్రొహిబిషన్, ఎక్సైజ్ (ఆబ్కారీ) సర్కిల్ కార్యాలయాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అసలే ఇరుకు, ఆపై కనీస మరమ్మతులు లేకపోవడం, పై పెచ్చులు ఊడుతున్నవి. అయినా ప్రత్యామ్నాయం లేక అందులోనే కార్యాలయం నిర్వహిస్తున్నారు. అసౌకర్యాల నడుమ తమ విధులు కొనసాగించక తప్పడం లేదని కార్యాలయం సిబ్బంది వాపోతున్నారు. ఇరుకుగా ఉండడంతో అక్రమ మద్యం, గుడుంబా, మత్తు పదార్థాలను రవాణా చేస్తుండగా పట్టుబడిన వాహనాలను సీజ్ చేసి అందులో పెట్టేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, ఎక్సైజ్, ప్రొహిబిషన్ కార్యాలయానికి సొంత భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. కానీ, స్థల సేకరణలో సంబంధిత శాఖల అధికారుల నిర్లక్ష్యంతోనే సొంత భవనాలకు నోచుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్థలం సేకరించి, సొంత భవన నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఐదేళ్ల చిన్నారి కిడ్నాప్‌నకు యత్నం

- బాలిక తల్లి కేకలు వేయడంతో అప్రమత్తమై కిడ్నాపర్‌ను పట్టుకున్న స్థానికులు

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 29: అమ్మ చేయి పట్టుకుని వెళ్తున్న ఐదేళ్ల బాలికను ఎత్తుకెళ్లేందుకు ఓ దుండగుడు ప్రయత్నించగా, స్థానికులు పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు. బాలిక తల్లి, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల పట్టణానికి చెందిన గట్టపెల్లి విజయ తన ఐదేళ్ల కూతురు హర్షిణితో కలిసి తల్లిగారి ఊరైన కొడిమ్యాల మండలం రామకిష్టాపూర్‌కు వెళ్లింది. ఆదివారం తన కూతురిని తీసుకుని ఆర్టీసీ బస్సులో జగిత్యాలకు వచ్చి బస్టాండ్‌లో దిగింది. ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కుదామని బస్టాండ్ బయట వేచి చూస్తున్నది. తల్లి వద్ద ఉన్న హర్షిణిని ఓ దుండగుడు ఎత్తుకెళ్లాడు. విజయ కేకలు వేయగా, అక్కడే ఉన్న స్థానికులు వెంబడించి పట్టుకుని చిన్నారిని విడిపించి తల్లికి అప్పగించారు. బాలికను కిడ్నాప్ చేసిన దుండగుడిని చితకబాదిన స్థానికులు పోలీసులకు అప్పగించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కిడ్నాపర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టగా, ముస్తాబాద్ మండలం పోతగల్‌కు చెందిన నవీన్‌గా గుర్తించారు. విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల టౌన్ పోలీసులు తెలిపారు.

యాదవుల హక్కులను సాధించుకోవడమే లక్ష్యం

సారంగాపూర్, డిసెంబర్ 29: యాదవుల హక్కులను సాధించుకోవడమే లక్ష్యమని యాదవ సంఘం అడహక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్ యాదవ్ పేర్కొన్నారు. బీర్‌పూర్ మండలం మంగెళ గ్రామంలో ఆదివారం ఆయన యాదవులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గనవేని మల్లేశ్ యాదవ్ మాట్లాడుతూ, యాదవ సంఘాన్ని జిల్లా వ్యాప్తంగా బలోపేతం చేసి, యాదవుల హక్కులను సాధించుకుంటామన్నారు. యాదవుల సమస్యల పరిష్కారానికి, యాదవ సంఘం బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ సందర్భంగా యాదవుల సమస్యలు, హక్కులు, తదితర అంశాలపై చర్చించారు. అనంతరం యాదవ సంఘం సభ్యత్వాలను నమోదు చేశారు. సభ్యులకు రసీదులు అందజేశారు. యాదవులంతా ఐక్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు కొల్ముల రమణ, చెరుపూరి సుభాష్, రెబ్బస్ మల్లన్న, బన్క శంకర్, చల్ల లక్ష్మణ్, యాదవ సంఘం అడహక్ కమిటీ మండల ఇన్‌చార్జి నరిగే తిరుపతి, మాజీ సర్పంచ్ చుంచు శారద-నరేందర్, ఎస్ మల్లేశం, రాజన్న, సతీశ్, పెద్ద భీమన్న, బాలయ్య, సత్తన్న, మల్లేశం, సుధాకర్, అశోక్, పోసవ్వ, సుమలత, వరణ్, యాదవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

రాయికల్, డిసెంబర్ 29: మండలంలోని బోర్నపల్లి గ్రామానికి చెందిన జంగిలి సుదర్శన్ ఓ ప్రైవేట్ పాఠశాల వాహనం నడుపుతూ ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. సుదర్శన్ శస్త్ర చికిత్స చేయించుకోగా, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న పట్టణంలోని ప్రగతి హైస్కూల్‌లో 2002-03 పదో తరగతి బ్యాచ్ మిత్రబృందం, ఐ కేర్ ఫౌండేషన్ (ఎన్జీవో) సభ్యులు ఆదివారం రూ.18 వేలు అందజేశారు. దాతలు సుదర్శన్ సెల్ నంబర్ 95739 67770లో సంప్రదించి ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నారు.

నగదు అందజేస్తున్న పదో తరగతి మిత్రబృందం

కొత్త సంవత్సర వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 29: నూతన సంవత్సర వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఎస్పీ అశోక్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు సూచించారు. 2024 సంవత్సరానికి వీడ్కోలు, నూతన సంవత్సర స్వాగత వేడుకలు ప్రశాంతంగా జరిగేలా జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. క్యూఆర్‌టీ, స్పెషల్ పార్టీ, సీసీఎస్, స్పెషల్ బ్రాంచి, ఐటీ సెల్, షీ టీంలతో జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా పెట్రోలింగ్ చేపడుతున్నామని తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తామని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈనెల 31న అర్ధరాత్రి 12.30 గంటల్లోగా వేడుకలను పూర్తి చేయాలని, పటాకులు కాలుస్తూ, ఎక్కువ సౌండ్‌తో మైకులు పెడితే చర్యలు తీసుకుంటామని, డీజేలకు అనుమతి లేదని, మద్యం మత్తులో వాహనాలు నడపరాదని, ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, ట్రిబుల్ రైడింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే వాహనం ఇచ్చిన వారిపై కేసు నమోదు చేస్తామన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలి

సారంగాపూర్, డిసెంబర్ 29: సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బోగ రమేశ్ కోరారు. బీర్‌పూర్‌లోని లక్ష్మీనరసింహ స్వామి జాతర గ్రౌండ్ సమీపంలో టీపీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన 2025 సంవత్సర టేబుల్ క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బోగ రమేశ్ మాట్లాడుతూ, కేజీబీవీల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులతో సర్దుబాటు చేయడాన్ని టీపీటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్క తీసుకోవాలన్నారు. సీఎం ప్రత్యేక చొరవ తీసుకుని సమగ్ర శిక్షా ఉద్యోగులతో చర్చలు జరిపి డిమాండ్లు పరిష్కరించాలన్నారు. 317 జీవో బాధితులందరికీ న్యాయం చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ, ఇతర బిల్లులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముప్పాల రాంచందర్ రావు, సూద కళ్యాణ్ కుమార్, ముక్క శంకర్, మసర్తి రమేశ్, మండల విద్యాధికారి నాగభూషణం, సూద రాజేందర్, ఎనగంటి సామ్రాట్, సుభాష్, ఎడ్ల సుశిన్, రిక్కల ప్రభాకర్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొక్కుల రాంచంద్రం, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, రఘుపతి, రవీందర్, వెంకటసత్యప్రకాశ్, రవి, నారాయణ, మహేశ్, రాజనర్సయ్య, సత్యనారాయణ, సుధాకర్, భీమరాజు, వెంకటరమణరెడ్డి, రాజయ్య, వహీద్, గంగయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వెలమ సంక్షేమ మండలి అభివృద్ధికి కృషి

వెలమ సంక్షేమ మండలి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల, డిసెంబర్ 29: వెలమ సంక్షేమ మండలి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. జగిత్యాలలో వెలమ సంక్షేమ మండలి ఆవరణలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, వెలమ సంక్షేమ మండలికి తనవంతు సహాయసహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అయిల్నేని సాగర్‌రావు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రావు, మాజీ అధ్యక్షులు రాజేశ్వరరావు, పురుషోత్తం రావు, ముప్నాళ్ల రాంచందర్ రావు, వెంకటేశ్వరరావు, సలహా మండలి సభ్యులు కొలుగురి దామోదర్ రావు, కార్యవర్గ సభ్యులు, సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కార్యవర్గ సభ్యులను మెన్నేని తిరుమల్ రావు, వేణుగోపాల్ రావు సన్మానించారు.

జగిత్యాల, డిసెంబర్ 29: సమ సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులే ప్రధాన పాత్ర వహించాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో టీపస్, పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నేటి సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. టీచర్స్ భవన్ అభివృద్ధికి నిధుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యాయులు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

సారంగాపూర్, డిసెంబర్ 29: నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఎస్ఐ దత్తాద్రి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేడుకల్లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులను ధ్వంసం చేస్తే వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

జగిత్యాల, డిసెంబర్ 29: జిల్లా కేంద్రంలోని జ్యోతి హైస్కూల్ విద్యార్థులు టాహిద్, అనూహ్య మహబూబ్‌నగర్‌లో ఈనెల 31 నుంచి జనవరి 2 తేదీ వరకు జరిగే సీఎం కప్ రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక య్యారు. అలాగే, 9వ తరగతి విద్యార్థి ఎత్తేశ్యమొద్దీన్ హకీంపేట్‌లోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను ఆదివారం పాఠశాల డైరెక్టర్ హరిచరణ్ రావు అభినందించి, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

జగిత్యాల/జగిత్యాల రూరల్, డిసెంబర్ 29: నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. జగిత్యాలలో లేడీస్ ఎంపోరియం యజమానుల అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన కార్యవర్గాన్ని అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జగిత్యాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పాంపర్తి రవీందర్, వర్తక సంఘం అధ్యక్షుడు కమటాల శ్రీనివాస్, అధ్యక్షుడు దీటి అంజయ్య, ప్రధాన కార్యదర్శి పూటూరి శ్రీధర్, కోశాధికారి వేణుమాధవ్, గౌరవాధ్యక్షులు మల్లికార్జున్, నాగభూషణం, శ్రీనివాస్, కౌన్సిలర్లు చుక్క నవీన్, కప్పల శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లు చేసిన ఎమ్మెల్యే

జగిత్యాల రూరల్, డిసెంబర్ 29: జగిత్యాలలోని పావని కంటి దవాఖాన, ఆపీ, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నియోజకవర్గంలోని 12 మంది పేదలకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేసి మందులు, కళ్లద్దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టర్ తిరుపతి గౌడ్, మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, కొలగాని సత్యం, రంగు మహేశ్, దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

పాలాస పాఠశాలకు పూర్వ విద్యార్థి విరాళం

గోపాల్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాల రూరల్, డిసెంబర్ 29: మండలంలోని పొలాస జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి అమెరికాలో స్థిరపడిన గోపాల్ అన్యారం భట్ల ఆదివారం పాఠశాలలో స్టేజీ నిర్మాణం, సౌండ్ సిస్టమ్, టిబుల్స్ కోసం రూ. 1.25 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

కోరుట్ల రూరల్, డిసెంబర్ 29: పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన కరణకుమార్ కొడుకు మహాన్ష్ ముఖానికి ఇటీల ప్రమాదవశాత్తు గాయాలు కాగా, ప్లాస్టిక్ సర్జరీ చేయించడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న కోరుట్ల లయన్స్‌క్లబ్ సభ్యులు ఆదివారం రూ. 10 వేల నగదు అందజేశారు. లయన్స్‌క్లబ్ కోరుట్ల అధ్యక్షుడు కుందారపు మహేందర్, లయన్స్‌క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామానికి చేరిన గల్ఫ్ మృతదేహాలు

మల్లాపూర్, డిసెంబర్ 29: మండల కేంద్రానికి చెందిన మానాల అశోక్ (45) ఇటీవల దుబాయ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా, మృతదేహం ఆదివారం స్వగ్రామానికి రాగా కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. అశోక్‌కు భార్య లక్ష్మి, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మేడిపల్లి, డిసెంబర్ 29: మేడిపల్లి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన శేరు ఎర్రయ్య అలియాస్ శేరు ఎర్రన్న ఈనెల 15న దుబాయ్‌లో బస్సు బోల్తాపడి మృతి చెందాడు. కాగా, మృతదేహం ఆదివారం రాత్రి స్వగ్రామానికి చేరుకోగా కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సిరికొండలో ఇసుక రీచ్ ఏర్పాటు

కథలాపూర్, డిసెంబర్ 29: కథలాపూర్ మండలం సిరికొండ గ్రామ శివారులో ఇసుక రీచ్ ఏర్పాటు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తహసీల్దార్ వినోద్ ఆదివారం తెలిపారు. ఇండ్లు, ఇతర నిర్మాణాలకు ఇసుక అవసరమున్న వారు మూడు క్యూబిక్ మీటర్ల ఇసుకకు రూ. 800 డీడీ రూపంలో చెల్లించి తహసీల్దార్ అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. పని దినాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే ఇసుకను రవాణా చేయాలన్నారు. అక్రమంగా వాహనాల్లో ఇసుకను తరలిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

హెచ్ఎంపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ధర్మపురి, డిసెంబర్ 29: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జడ్పీ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు రాములుపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మ్యాన పవన్, జిల్లా అధ్యక్షుడు గంగాధరి మహేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళ వేధింపులు తట్టుకోలేక..

- కోనరావుపేట సింగిల్ విండో డైరెక్టర్ ఆత్మహత్య

కోనరావుపేట, డిసెంబర్ 29: కొత్త ఇల్లు కొనివ్వాలని ఓ మహిళ వేధింపులను కోనరావుపేట సింగిల్ విండో డైరెక్టర్ తట్టుకోలేక పోయాడు. ఇప్పటికే పెద్ద ఎత్తున వసూలు చేసి, ఇప్పుడు ఇల్లు కొనివ్వాలని బెదిరింపులకు దిగడంతో మనోవేదన చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం వెంకట్రావుపేటకు చెందిన పల్లం సత్తయ్య(62) కోనరావుపేట సింగిల్ విండో డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు వేములవాడలో మరో ఇల్లు ఉన్నది. ఆ ఇంటి పక్కనే అద్దెంట్లో నిజామాబాద్ క్లస్టర్ ఎంఎస్‌సీసీ (మండల సమాఖ్య క్లస్టర్ కోఆర్డినేటర్) గా పనిచేస్తున్న కరీంనగర్‌కు చెందిన ముఠా రేణుక ఉంటున్నది. 2017 ఏప్రిల్‌లో ఆమె సత్తయ్యను ఫోన్‌లో పరిచయం చేసుకొన్నది. తనకు పక్కంటి వారితో సమస్య ఉందని, పరిష్కరించాలని ఇంటికి పిలిచి వేధించింది. అప్పటి నుంచి సహజీవనం చేస్తూనే బెదిరింపులకు గురిచేసింది. నిత్యం వేధిస్తూ బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు, ₹25లక్షలకు పైగా నగదు కాజేసేంది. కొంతకాలం నుంచి కరీంనగర్‌లో తనకు ₹40లక్షలతో కొత్త ఇల్లు కొనివ్వాలని ఒత్తిడి చేసింది. తన సోదరుడు ముఠా అశోక్‌కుమార్‌తో కలిసి చంపుతానని బెదిరించింది. ఈ విషయం సత్తయ్య కుటుంబసభ్యులకు తెలియడంతో మూడు నెలలుగా గొడవలు కూడా జరుగుతున్నాయి. అప్పటి నుంచి సత్తయ్య తీవ్ర మనోవేదనకు గురై, ఒంటరిగానే తిరుగుతున్నాడు. ఈ క్రమంలో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల17న తన చావుకు రేణుక, అశోక్ కారణమని సూసైడ్ నోట్ రాసుకున్నాడు. శనివారం సాయంత్రం గ్రామ శివారుకు వెళ్లి, పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేటలోని ఓ హాస్పిటల్‌కు తరలించారు. ఆదివారం ఉదయం పరిస్థితి విషమించి మృతి చెందాడని వైద్యులు తెలిపారు. సత్తయ్యకు భార్య మల్లవ్వ, కొడుకు, కూతురు ఉన్నారు. భార్య మల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. విదేశాల్లో ఉన్న కొడుకు, కూతురు రాగానే, సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కాగా, సత్తయ్య మృతికి కారణమైన ముఠా రేణుకతోపాటు ఆమె సోదరుడు ముఠా అశోక్‌కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338986-All

CHANGE OF NAME
Arvapalli Shobha Rani, W/o. Umapathi (old Name) H.No. 6-12-19/A, V/o. Kothapalli, Gambhiraopet Mandal, Rajanna Sircilla Dist. My Name Was Changed to ARVAPALLI SHOBHA W/o. UMAPATHI (New Name)

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

కోరుట్ల, డిసెంబర్ 29: పట్టణ ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ సురేశ్‌బాబు సూచించారు. పట్టణంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నూతన సంవత్సర వేడుకల్లో యువత మద్యం సేవించి రాత్రుళ్లు రహదారులపైకి రావద్దన్నారు. అర్ధరాత్రి వరకు డీజేలు, ఇతరులకు ఇబ్బంది కలిగించే కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. పోలీస్ శాఖ నిబంధనలు పాటిస్తూ శాంతి భద్రతలకు సహకరించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఇబ్రహీంపట్నం/మేడిపల్లి/కథలాపూర్, డిసెంబర్ 29: నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఇబ్రహీంపట్నం, మేడిపల్లి, కథలాపూర్ ఎస్ఐలు అనిల్, శ్యామ్‌రాజ్, నవీన్‌కుమార్ సూచించారు. ఆయా పోలీస్ స్టేషన్లలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. తాగి వాహనం నడిపిన, ర్యాష్ డ్రైవింగ్ చేసిన వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. పోలీసుల నిబంధనలు పాటిస్తూ నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని సూచించారు.

నిధులు మంజూరు చేయించాలి

వెల్గటూర్, డిసెంబర్ 29: వెల్గటూర్‌లో అయ్యప్ప ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని ధర్మపురిలోని క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ఆదివారం అయ్యప్ప స్వాములు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, వెల్గటూర్‌లో అయ్యప్ప ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు పెద్ది శ్రీనివాస్, తిప్పర్తి చంద్రమౌళి, సంకోజు నరేశ్, గండ్ర రంజిత్‌రావు, బొడ్డు రామస్వామి, పెద్దూరి భరత్, బోడకుంటి రమేశ్, గంట్యాల రాజేందర్, గుండ జగదీశ్వర్, గాలిపల్లి మహేశ్, సిరంగి లక్ష్మణ్, గుంత సంతోష్, సంకోజు సురేశ్, నాయకులు గండ్ర శ్రీకాంత్‌రావు, కొత్త తిరుమల్, గుండేటి సందీప్‌రెడ్డి తదితరులున్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

కోరుట్ల రూరల్, డిసెంబర్ 29: అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ ఇట్యాల కిషన్ హెచ్చరించారు. స్థానిక తహసీల్ కార్యాలయంలో ఆదివారం ఆయన ఇసుక రవాణా చేసే వారితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇసుక రవాణా చేసే వారు ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని సూచించారు. అక్రమంగా ఇసుక నిల్వ చేసినా, రవాణా చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

జగిత్యాల టౌన్, డిసెంబర్ 29: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో టీఆర్టీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆయన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం విప్ లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ, సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండ శంకర్, దినేష్‌కుమార్, టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తు